ప్రజాశక్తి
మంగళవారం 6 ఫిబ్రవరి 2024

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కమిషనర్ రెండోసారి కమిషనర్‌గా వచ్చిన పొందూరు సింహాచలం సోమవారం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కమిషనర్‌ను అభినందిస్తూ పట్టణ అభివృద్ధికి సంబంధిత అధికారులతో కలిసి కృషి చేయాలని అన్నారు. వీటితోపాటు పట్టణ సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కార దిశగా అడుగులు వేయాలని సూచించారు.



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న కమిషనర్

ముడుపుల మత్తులో అధికారులు

- అక్రమ నిర్మాణాలకు అడ్డుగోలు అనుమతులు
- ఇరుకు సందుల్లో గ్రూపు హౌస్ పనులు
- నిబంధనలకు తిలోదకాలు

ప్రజాశక్తి - సాలూరు

ముడుపుల మత్తులో పడిన అధికారులు మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలకు అడ్డుగోలుగా అనుమతులు మంజూరు చేస్తున్నారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా అధికారులు కళ్లు మూసుకుని ఓకే చెపుతున్నారు. పట్టణంలో అనేక చోట్ల ఇరుకు సందుల్లో అపార్ట్‌మెంట్లు, గ్రూపు హౌస్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయి. అధికారులకు ముడుపులు చెల్లిస్తే చాలు ఎన్ని ఉల్లంఘనలున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రూపు హౌస్‌లు గానీ, అపార్ట్ మెంట్లు గాని నిర్మిస్తే వాహనాల రాకపోకలకు వీలుగా రహదారి సౌకర్యం వుండాలి. అగ్ని ప్రమాదాలు, ఇతర ప్రమాదాలేమైనా జరిగితే అగ్నిమాపక వాహనం రాకపోకల కోసమైనా అనువైన రహదారి సౌకర్యం ఉండాలి. కానీ అలాంటి నిబంధనలేవీ పాటించకుండా నిర్మాణాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. పట్టణంలోని పత్తివీధిలో ఇరుకు సందులో గ్రూపు హౌస్ నిర్మాణానికి అధికారులు అనుమతి ఇచ్చారు. మున్సిపల్ రోడ్డు మీదకు వచ్చి భవన యజమాని నిర్మాణాన్ని చేపట్టారు. అంతేకాక గ్రూపు హౌస్ ముందున్న విద్యుత్ స్తంభం వాలిపోయే లా చేసి భవన నిర్మాణం చేశారు. ఆ విద్యుత్ స్తంభానికి చుట్టు పక్కల ఉన్న ఇళ్ల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇటీవల గ్రూపు హౌస్‌కు విద్యుత్ సరఫరా చేయడానికి స్థానిక విద్యుత్ శాఖ సిబ్బంది ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వీధిలో ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చుట్టూ ఉన్న నివాసితులు రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేపట్టారు. విద్యుత్ అధికారులు అక్రమ నిర్మాణాలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు గృహ వినియోగదారులకు సరఫరా నిలిపివేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు కూడా లంచాలు తీసుకుని అడ్డగోలుగా కనెక్షన్లు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పత్తివీధిలో దగ్గర దగ్గరగా నిర్మిస్తున్న గ్రూప్‌హౌస్‌లు

ఇళ్ల పేరిట వ్యాపార సముదాయాలు

పట్టణంలో చాలా చోట్ల ఇళ్ల నిర్మాణం పేరుతో కొంతమంది వ్యాపారులు వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నారు. కొంకివీధిలో ఇలాంటి నిర్మాణానికి అధికారులు అనుమతి మంజూరు చేయడం చర్చనీయాంశమైంది. ఈ నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా జరిగినా అధికారులు కనీసం యాజమానికి నోటీసులు కూడా జారీ చేయలేదు. ముడుపుల మత్తులో జోగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు నిబంధనల ఉల్లంఘనలను సొమ్ము చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్ని ఉల్లంఘనలు వుంటే అంత ఎక్కువగా డబ్బులు గుంజుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జెకెసికి 185 వినతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 185 వినతులు అందాయి. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటిడిపి పిఒ సి.విష్ణుచరణ్, కెఆర్‌సిసి డిప్యూటీ కలెక్టరు జి.కేశవనాయుడుతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చే వినతులను సత్వరమే, శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని, అధికారులు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలని కలెక్టరు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ప్రజల పలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 185 అర్జీలు అందజేశారు. పలుశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

పార్వతీపురంరూరల్ : సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం ఎస్పీ కార్యాలయంలో దాఖలు చేసిన దరఖాస్తులకు సంబంధిత పోలీసు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి సమస్య పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సిబ్బందిని ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎఎస్‌పితో కలిసి నేరుగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ, ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమపేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7 దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, తీసుకున్న చర్యలను జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో 7 ఫిర్యాదులు స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో ఎస్‌బి సిఐ సిహెచ్.లక్ష్మణరావు, డిసిఆర్‌బి సిఐ సిహెచ్.వాసునాయుడు, ఎస్ఐ ఎస్‌కె ఫక్రుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఐటిడిఎలో...

సీతంపేట : గిరిజనులు ఆరుగాలం శ్రమించి సేకరించిన అటవీ ఉత్పత్తుల్లో గిరిజనులకు ఆర్థికంగా చేయూతనిచ్చేది జీడి పంట. ఈ పంటను జిసిసి, ఐటిడిఎ ద్వారా నుగోలు చేసి, గిరిజనులకు గిట్టుబాటు ధర కల్పించి వారికి న్యాయం చేయాలని స్థానిక ఐటిడిఎ పిఒ కల్పనాకుమారికి గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతి రావు, బి.సాయి, జె.శ్రీరాములు, ఎం.కామేష్ స్పందన కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించారు. సోమవారం స్థానిక ఐటిడిఎలో జరిగిన గిరిజన స్పందన పిఒ ఆధ్వర్యాన స్పందన కార్యక్రమం నిర్వహించారు. దీంతో పాటు దిగువ మూల్లెలగూడ చెందిన సింహాచలం ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఇసుక గెడ్డకు చెందిన రమ్య రేషన్ కార్డులో పేరు తొలగించాలని, పూతికవలసవలసకు చెందిన సూరయ్య సామాజిక భవనం మంజూరు చేయాలని విన్నవించారు. ఓంద్రుజోలకు చెందిన భారతి వితంతువు పెన్షన్ మంజూరు చేయాలని, గొరపాడుకు చెందిన అయ్యప్ప సెల్ టవర్ మంజూరు చేయాలని కోరారు. ఈ స్పందనకు వివిధ సమస్యలపై 164 వినతులు వచ్చాయి. స్పందన కార్యక్రమంలో ఎపిఒ రోషిరెడ్డి, ఇఇ సింహాచలం, డిడి అన్నదొర, పిహెచ్ఒ గణేష్, సిడిపిఒ రంగలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి తదితరులు పాల్గొన్నారు

డివార్మింగ్‌డే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి, ఐటిడిఎ పిఒ

డివార్మింగ్ డేను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఈనెల 9న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టరు నిశాంత్ కుమార్ ఆదేశించారు. విద్యార్థులందరికీ అల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు అన్నారు. సోమవారం తన కార్యాలయ సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పోస్టర్లను కలెక్టరు విడుదల చేశారు. జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని విద్యాసంస్థలకు మందుల పంపిణీ జరగాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ చేయాలని సూచించారు. రక్త హీనత, నులిపురుగుల నివారణ ఆవశ్యకత ఉందని గుర్తించాలన్నారు. ఈనెల 9న మాత్రలు తీసుకొని పిల్లలకు 10, 11 తేదీలలో విధిగా అందించాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు మాట్లాడుతూ జిల్లాలో 84,426 మంది బాలురు, 88,465 మంది బాలికలు వెరసి 1,75,891 మంది బాలబాలికలున్నారని తెలిపారు. జిల్లాలో అంగన్వాడీలు మినహా 3750 విద్యా సంస్థలున్నాయని ఆయన చెప్పారు. ఆల్ బెండజోల్ మాత్రలు ఇప్పటికే క్షేత్ర స్థాయికి పంపించామన్నారు. 1 నుండి 5ఏళ్ల చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల్లోనూ, 6 నుండి 19 ఏళ్ల విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలలలో పంపిణీ జరుగుతుందని వివరించారు. భోజనం అనంతరం మాత్రలు మింగించాలని ఆయన చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, పార్వతీపురం పిఒ సి.విష్ణు చరణ్, కెఆర్ఆర్‌సి ఎస్డిసి జి.కేశవనాయుడు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ కొయ్యాన అప్పారావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డిటి నుంచి ఆర్‌డిఒ వరకూ...

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ రెవెన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణకు రెవెన్యూ శాఖలో పట్టున్న అధికారిగా మంచి గుర్తింపు ఉంది. స్వస్థలం అనకాపల్లి. అక్కడే ఇంటర్ వరకు చదువుకొని ఉన్నత చదువులు విశాఖపట్నం వెళ్లి పూర్తి చేశారు. ఎంబిఎ వరకు చదువుకున్న ఆయన 2007లో శ్రీకాకుళం డిటిగా ఎంపికయ్యారు. 2011లో తహశీల్దారుగా ఉద్యోగ ఉన్నత పొంది నాతవరం, నర్సీపట్నం, నక్కపల్లి ప్రాంతాల్లో తహశీల్దారుగా పని చేశారు. 2014లో గజపతినగరం తహశీల్దారుగా పని చేస్తూ, సార్వత్రిక ఎన్నికలు జరపడంతో కీలకపాత్ర పోషించారు. ఏడాది క్రితం డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నత పొంది పోలవరం ఇరిగేషన్ పరిధిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో కూనవరం యూనిట్ భూసేకరణ అధికారిగా పనిచేశారు. అక్కడ నుండి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయనకు రెవెన్యూ శాఖలో సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు ఉంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికలు జరుగనున్న తరుణంలో దానిపై దృష్టి పెడతానన్నారు. కురుపాం నియోజకవర్గం ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్నానని, ఇక్కడ ఎన్నికలకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. అదే విధంగా రెవెన్యూ పరంగా 7మండలాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఆర్‌డిఒ వెంకటరమణ

ఎబిబి చెక్ పోస్టు తనిఖీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతమైన రావికోన, బట్టివలస దగ్గర ఇటీవల ఏర్పాటు చేసిన చెక్ పోస్టును జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎఎస్‌పి సునీల్ షరోన్‌తో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒడిశా నుంచి వస్తున్న వాహనాలను ఆపి నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నాటుసారా, గంజాయి రవాణా అరికట్టే భాగంగా వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని చెక్‌పోస్ట్ సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

వాహనదారునితో మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కలెక్టరేట్ వద్ద మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

దీర్ఘకాలంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్‌కు వినతిని అందజేశారు. తొలుత సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, కోశాధికారి జి.వెంకటరమణ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు తులసి మాట్లాడుతూ ఎన్నికల ముందు సిఎం జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర నిర్వహించి తాను అధికారంలోకి వస్తే మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులకు రూ.10వేలు వేతనం ఇస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చేక మాట తప్పారని అన్నారు. ఇప్పటికైనా హామీ ఇచ్చిన వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో ప్రభుత్వాలు వెట్టిచాకిరీ చేయించు కుంటున్నాయని విమర్శించారు. మధ్యాహ్నం భోజనం నిర్వాహకులకు ప్రతినెలా ఐదో తేదీ లోపు వేతనం చెల్లించాలని, మెనూ ఛార్జి రూ.20కు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పథకం అమలు చేసే చోట కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదన్నారు. ప్రమాద బీమా సౌకర్యం వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం చెల్లించాలని, మట్టి ఖర్చులు ఇవ్వాలని, హైస్కూల్లో పనిచేస్తున్న వారికి వేతనం ఇవ్వాలని కోరారు. మధ్యాహ్నం భోజనం నిర్వాహకులకు సెలవులు వర్తింపచేయాలని, మెటర్నటీ, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని, ఏడాది 2జతల యూనిఫాం, రెండు నెలలకు ఒకసారి వర్కర్లతో ఎంఇఒలు సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ పౌరసంక్షేమ సంఘం నాయకులు పాకల సన్యాసిరావు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు మువ్వల లక్ష్మి, ఎం.మహాలక్ష్మి, బంకురు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న పిఒ కల్పనాకుమారి

'ఆడుదాం ఆంధ్ర'లో క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి- సీతంపేట

ఆడుదాం ఆంధ్ర జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో భాగంగా పార్వతీపురంలో నిర్వహించిన పోటీల్లో ఖోఖో క్రీడలో గొయ్యిది సచివాలయానికి చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించి, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 9వ తేది నుండి విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. ఈ మేరకు వీరిని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కల్పన కుమారి సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, సీతంపేట స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానందం, గొయ్యిది సర్పంచ్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌ను కలిసిన కమిషనర్

ప్రజాశక్తి - సాలూరు

ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ విధుల్లో చేరిన మున్సిపల్ కమిషనర్ పి.ప్రసన్న వాణి సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మని కలిశారు. చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శనివారం సాయంత్రం ప్రసన్న వాణి స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ప్రసన్న వాణి బదిలీపై ఇక్కడకి వచ్చారు.



చైర్‌పర్సన్‌కు పూలబొకేను అందజేస్తున్న కమిషనర్

పొత్తు పొసిగేనా..?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



టిడిపి, జనసేన పొత్తులో తగ్గేదెవరు? నెగ్గేదెవరు?... ఇదీ జిల్లాలో నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో సాగుతున్న ఆసక్తికర రాజకీయం. నెల్లిమర్ల సీటు కోసం జనసేన ఆశపడుతుండగా, అది గెలిచే సీటు కాబట్టి ఓసారి లోతుగా ఆలోచించాలని టిడిపి అధినేత అంటున్నట్టుగా సమాచారం. టిడిపి, జనసేన పొత్తు నేపథ్యంలో సీట్ల కేటాయింపు విషయమై ఆయా పార్టీల అధినేతలు నారా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ ఆదివారం రెండు దఫాలుగా చర్చించడం, రాష్ట్ర వ్యాప్తంగా 28సీట్లు జనసేనకు కేటాయించేందుకు పరస్పరం ఆలోచన చేసినట్టు వార్తలు రావడం విధితమే. అధినేతల చర్చల్లో నెల్లిమర్ల సీటుపై ఇరు పార్టీల నేతలూ ఆసక్తి చూపినట్టుగా తెలుస్తోంది. జిల్లాలోగానీ, నెల్లిమర్లలో గానీ జనసేనకు ఉన్న సొంత బలం ఎంత? అన్నది కాసేపు పక్కనబెడితే... నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి గతంలో పోటీచేసిన అభ్యర్థి ఈసారి ఎలాగైనా రంగంలోకి దిగేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పలుమార్లు పవన్ కల్యాణ్‌ను కలవడంతో తాజాగా ఇరు పార్టీల నేతల మధ్య జరిగిన చర్చల్లో నెల్లిమర్ల అసెంబ్లీ స్థానం గురించి ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. మొత్తం తమకు కేటాయించబోతున్న సీట్లలో విజయనగరం జిల్లా నెల్లిమర్ల అసెంబ్లీ స్థానం కూడా వదిలిపెట్టాలని పవన్ కల్యాణ్ ప్రతిపాదన పెట్టినట్టుగా తెలిసింది. తమ పార్టీకి చెందిన స్థానిక నేత తొలి నుంచీ ప్రజలను అంటిపెట్టుకుని ఉన్నారని, ఎన్నికల్లో పోటీని తట్టుకునే స్థోమత కూడా ఉందని, ఈనేపథ్యంలో తమకు రిజర్వు చేయాలని బాబుకు వివరించినట్టుగా సమాచారం. ఈ విషయంలో చంద్రబాబు తటపటాయించినట్టుగా తెలిసింది. ఆ స్థానంలో తాము దింపాలనుకుంటున్న అభ్యర్థి సామాజిక కోణాన్ని బట్టి సునాయాశంగా గెలిచే అవకాశం ఉంటుదని, జనసేన తరపున అటువంటి అవకాశం ఉంటుందా? లేదా అన్నది మరోసారి సున్నితంగా ఆలోచించాలని బాబు చూసించినట్టు సమాచారం.

నెల్లిమర్ల స్థానంలో గజపతినగరం సీటును కేటాయించే విషయంలో కూడా చర్చ జరినట్లు తెలిసింది. వాస్తవానికి నెల్లిమర్ల నియోజకవర్గాన్ని అధికార ప్రతిపక్షాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. ఓవైపు సముద్రతీరం, మరోవైపు విలాసవంతమైన రిసార్ట్స్, వాటికి ఆనుకుని వీటికి అనుసంధానంగా బెంగుళూరు-కోల్‌కత్తా జాతీయ రహదారి, దీనికితోడు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు రాబోతున్న నేపథ్యంలో ఈ ప్రాంతం ఖరీదైన ప్రాంతంగా మారింది. ఎయిర్‌పోర్టు పూర్తయితే దేశ, విదేశాలకు చెందిన నేతలు, రాష్ట్ర కేంద్ర మంత్రులు ఈ ప్రాంతం నుంచే వచ్చిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈనేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యేలకు ప్రోటోకాల్ కూడా అనివార్యంగా ఎక్కువగానే ఉంటుంది. ఈ కోణంలో టిడిపి నెల్లిమర్లను అంత సులువుగా వదులకునే పరిస్థితి లేదని పలువురు విశ్లేషిస్తున్నారు. అసలు తక్కువ సీట్లు, అందులోనూ పోటీచేసేందుకు అనువుగాను, అభ్యర్థులు ఆసక్తి చూపిన చోట ఇవ్వకపోతే ఎందుకు? అన్నట్టుగా జనసేనలో చర్చనడుస్తోంది. అధినేత పవన్ కల్యాణ్ కూడా ఇదే కోణంలో ఆలోచిస్తున్నారని సమాచారం. పొత్తు పొసుగులో టిడిపి, జనసేనల్లో ఏ పార్టీ వెనక్కి తగ్గుతుందో వేచి చూడాల్సిందే.

ఎమ్‌పికి, రైల్వే అధికారులకు వినతిని అందజేస్తున్న ప్రసన్నకుమార్

అండర్ బ్రిడ్జి నిర్మాణానికి వినతులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం కొత్తవలస రైల్వే స్టేషన్‌కు అనుసంధానంగా అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం అరకు ఎంపి గొడ్డేటి మాధవిని, రైల్వే డిఆర్ఎం సరవ్ ప్రసాద్, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ మీనా లను సోమవారం విశాఖలోని వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఎపి టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం లో నిర్మించిన ఫ్లై ఓవర్ వల్ల స్థానిక కొత్తవలస సమీపంలో ఉన్న రైల్వే లైన్‌పై దాటుకుంటూ స్కూల్ పిల్లలు, పెద్దలు వెళ్లడానికి, ముఖ్యంగా ఆ ప్రాంతంలో అంతిమ సంస్కారాలు చేసేందుకు శ్మశానానికి వెళ్లేందుకు ఇబ్బందికరంగా మారిందని, సుమారు 9 గ్రామాల రాకపోకలకు, కొత్తవలస ప్రాంతం ప్రజలకు మేలు జరిగే విధంగా అండర్ పాస్‌వే నిర్మాణం జరుపాలని కోరామన్నారు. దీనికి స్పందించిన రైల్వే అధికారులు విజయరామరాజు కాలనీ కొత్తవలస నుండి బెలగాం రైల్వే గేట్ వరకు 60 అడుగుల రోడ్ నిర్మాణానికి మధ్యలో అండర్ పాస్ నిర్మాణం తక్షణం చేపట్టడానికి అంగీకరించారన్నారు. కొత్తవలస విజయరామరాజు కాలనీ నుండి సత్యనారాయణ స్వామి టెంపుల్ వైపు, అండర్ పాస్ లేదా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు బృందాన్ని పంపించి సర్వే జరిపిస్తామని, అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం పై సాధ్యా సాధ్యాలు పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు జమ్మాన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవకోటి శంకర్ రావు, భోఘవిల్లి శేఖర్, పాత్రుని దినేష్, దివిలి ఉమా మహేశ్వర రావు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - పాలకొండ

రేషన్ బియ్యం పంపిణీ వేగవంతం చేయాలని తహశీల్దారు వరహాలు అన్నారు. సోమవారం నగర పంచాయతీ పరిధిలోని 7వ వార్డులో రేషన్ బియ్యం పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. బియ్యం ఎలా జరుగుతుందన్న ఈ విషయాలపై ఆరా తీశారు. సకాలంలో లబ్ధిదారులకు బియ్యం చేరాలని సిబ్బందికి ఆదేశించారు.

చలివేంద్రిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రిలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వర వివిధ రకాలైన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ,ఆశా కార్యకర్తలు ,104 సిబ్బంది, పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో లోపాలుంటే చెప్పండి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏ విధమైన లోపాలున్నా తమ దృష్టికి తీసుకురావాలని తహశీల్దార్ కె.జయప్రకాష్ బూత్ లెవెల్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. త్వరలో స్థానిక ఎన్నికలు జరగనున్నందున పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్తు, మరుగుదొడ్లు, తాగునీరు, ర్యాంపులు మొదలగు ఏ విధమైన లోటు పాట్లున్నా తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల నిర్వహణలో అలసత్వం వహిస్తే సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్‌రాజు, డిటి సిహెచ్ సత్యనారాయణ, ఆర్ఐ లక్ష్మునాయుడు, ఇఒపిఆర్‌డి టి .వెంకట రమణమూర్తి, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజనుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా సహాయ కార్యదర్శి టి. జీవ అధికారులకు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల ప్రజలతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్ళ లేని గిరిజన గ్రామాల్లో నివసిస్తున్న ప్రజల దీర్ఘకాలిక సమస్యలైన ఇళ్ళ, ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని, ప్రతి గిరిజన గ్రామానికి రహదారి, తాగునీటి సౌకర్యం కల్పించేలా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి సూరయ్య, గిరిజన గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం సక్రంగా పంపిణీ చేయాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి బి సిమ్మమ్మ అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. సోమవారం స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమయపాలన పాటించి విధిగా అంగన్వాడీ కేంద్రాలు తెరవాలని, ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. జనన, మరణాల వివరాలు రికార్డులో పొందుపరచుకోవాలని, ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జె.జ్యానమ్మ, ఎన్.రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టైలర్స్ యూనియన్ జాయింట్ సెక్రటరీగా చిన్నారావు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

న్యూ నవ్యాంధ్ర రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా పార్వతీపురం పట్టణానికి చెందిన దర్జీలు వర్ధిపు చిన్నారావును, జాయింట్ సెక్రెటరీగా, కమిటీ సభ్యునిగా శుభలేఖ శ్రీనివాసరావును నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు వి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం విశాఖలో రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో వీరిద్దరూ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న టైలర్ల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

ఆలయాభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

కొమరాడ మండలంలోని గుంప సోమేశ్వర ఆలయం అభివృద్ధికి సహకరించాలని కోరుతూ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కాపారపు శివున్నాయుడు, మీసాల రామగోపాల్ నాయుడు, రత్తల అప్పలస్వామి, శ్రీహరి నాయుడు, జి రామారావు బృందం ఈ మేరకు సోమవారం విజయవాడలో దేవాదాయశాఖ కమిషనర్ని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ అభ్యర్థనపై దేవాదాయ కమిషనర్ సానుకూలంగా స్పందించారని త్వరలోనే చర్యలు చేపడతామన్నారని తెలిపారు.

అనుమతుల్లేకుండా వాహనాలు నడపొద్దు

ప్రజాశక్తి - పాలకొండ

అనుమతుల్లేకుండా వాహనాలు నడపడం నేరమని, అటువంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని సిఐ చంద్రమౌళి అన్నారు. సోమవారం ఎసికె రాజుపురం జంక్షన్లో వాహనాలు తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్ట రీత్యా నేరమన్నారు. సరైన పత్రులు లేని వాహనాలను గుర్తించి అపరాధ రుసుం వేశారు.

ఆటో బోల్తా ; 18 మందికి గాయాలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక వైటిసి సమీపంలో కొత్తూరు నుండి పాలకొండ వైపు వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. సీతంపేట మండలం ఆరికాట కాలనీ నుంచి పాలకొండ మండలం లక్ష్మిపురం కూలి పనులు నిమిత్తం ఆటోలో వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 18మందికి గాయాలు కావడంతో సీతంపేట ఏరియా ఆసుపత్రికి అంబులెన్స్ ద్వారా తరలించారు. వీరిలో ముగ్గుర్ని పాలకొండ తరలించారు. సీతంపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

బర్త్‌డే శుభాకాంక్షలు చెబుతున్న వైసిపి నాయకులు

ఘనంగా వైసిపి నాయకుని జన్మదిన వేడుకలు

సాలూరు: పట్టణ వైసిపి అధికార ప్రతినిధి మండపల్లి బర్రి జన్మదినం సందర్భంగా సోమవారం సాయంత్రం స్థానిక రామాలయంకాలనీలో వేడుకలు నిర్వహించారు. బర్త్ డే కేక్ కట్ చేసి నాయకులు కార్యకర్తలకు పంపిణీ చేశారు. బర్రికి అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, యువజన్ విభాగ్ అధ్యక్షులు కర్రి వెంకట్రావు, జెసిఎస్ కన్వీనర్ గిరి రఘు, వైసిపి నాయకులు గిరి చిన్ని శుభాకాంక్షలు తెలిపారు.

యువతకు వాలీబాల్ కిట్లును అందిస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - కురుపాం

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎస్. షణ్ముఖరావు అన్నారు. సోమవారం రాత్రి మండలంలో ఏగులవాడ పంచాయతీ జోంగరపాడు గిరిజన గ్రామంలో యువత, మహిళలకు, గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ యువత ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాల్లో స్థిరపడినపుడే కుటుంబం ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని అన్నారు. అనంతరం యువతకి వాలీబాల్ కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఆశావర్కర్ల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.శివాని ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద స్పందనకు వచ్చిన డిఎంహెచ్ఒ బి.జగన్నాధరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ కనీసవేతనం రూ.10వేలు ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, పాదయాత్రలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, ఆశావర్కర్ల సంఘ నాయకులు టి.కృష్ణవేణి, కె.జ్యోతి, ఎం.గౌరి పాల్గొన్నారు.

కొమరాడ : ఆశా కార్యకర్తలను, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతూ ఈనెల 8న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమంలో ఆశాలంతా పాల్గొనాలని సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక పిహెచ్‌సి హెచ్‌వికి వినతిని అందజేశారు. అనంతరం సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు రాజేశ్వరి, పార్వతి, ఆదిలక్ష్మి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ యూనియన్ నాయకులు దుర్గ, లక్ష్మీపార్వతి మాట్లాడుతూ పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వ కార్మికులకు గుర్తించాలని కోరారు. దీర్ఘ కాలంగా పనిచేస్తున్న వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవు వేతనంతో కూడిన వెటర్నరీ లీవ్ అమలు చేయాలని, సంబంధం లేని పనులు చేయించరాదని కోరారు. వీటితో పాటు మరిని సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 8న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఆశా వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆశా వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కులు పాల్గొన్నారు.

కొమరాడ: వినతి పత్రాన్ని అందిస్తున్న కొల్లి సాంబమూర్తి, ఆశాలు

పాచిపెంట : మండల కేంద్రంలో ఆశా వర్కర్లకు కనీస వేతనం గ్రూప్ ఇన్సూరెన్స్, సెలవులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ సంక్షేమ పథకాలపై సిహెచ్‌డబ్ల్యుసి, ఆశా వర్కర్లు చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు జి.మంజుల, పి.నిర్మల, శ్రామిక మహిళ సంఘం జిల్లా నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ కనీస వేతనాలు చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5ఐదు లక్షలు ఇవ్వాలని, 62 ఏళ్ల రిటైర్మెంట్ జీవోను వర్తింప చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సిహెచ్‌డబ్ల్యులకు, ఆశాలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పై సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 8న విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిహెచ్‌డబ్ల్యుఒ యూనియన్ కార్యకర్త సౌజన్య, సిఐటియు మండల నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

పార్వతీపురం: డిఎంహెచ్ఒకు వినతి పత్రాన్నిస్తున్న యూనియన్ నాయకులు

సీతంపేట: కనీస వేతనాలు, గ్రూప్ ఇన్సూరెన్స్, సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సంక్షేమ పథకాల కోసం ఈనెల 8వ తేదీన ఆశా వర్కర్ చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. సీతంపేటలో ఆశా వర్కర్ల సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌ను ఆశాలుగా మార్పు చేయాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్స్,మె టర్నటి లీవ్స్ అమలు చేయాలని, తదితర సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ (సిఐటియు)ఆధ్వర్యంలో ఈనెల 8న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే ధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు సీతంపేట మండల కమిటీ కార్యదర్శి ఎం.కాంతారావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎస్.లక్ష్మి, ఎస్.మాలతి, పి.ఉష తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన తహశీల్దార్లు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక తహశీల్దార్‌గా ఎ.వేణుగోపాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అరకు వ్యాలీ మండలంలో పనిచేస్తూ ఎన్నికలు నేపథ్యంలో బదిలీపై కురుపాం వచ్చారు. గతంలో కురుపాం తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్.రమేష్‌కుమార్ బదిలీపై కొమరాడ మండలానికి వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తహశీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ మండలంలోని అందరి అధికారులను, ప్రజాప్రతినిధులను కలుపుకుంటూ తన విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని, అందరూ సహకరించాలని కోరారు.

పాలకొండ : తహశీల్దారుగా వరహాలు సోమవారం బాధ్యతలు చేపట్టారు. విశాఖపట్నం జిల్లాలో పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన తహశీల్దారు సోమేశ్వరరావు అల్లూరి సీతారామరాజు జిల్లా అరుకు మండలానికి బదిలీ అయ్యారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్‌గా జివి జనార్ధన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి పనిచేస్తున్న ఎంవి రమణకు విశాఖపట్నం బదిలీ అయ్యింది. ఈ సందర్భంగా ఆయనకు విఆర్వోలు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, డిటి, విఆర్ఒలు, సిబ్బంది పాల్గొన్నారు

సీతానగరం: తహశీల్దార్‌కు శుభాకాంక్షలు చెబుతున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం తహశీల్దార్‌గా శివ శంకర సత్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీకాకుళం జిల్లా సోంపేట నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మరోవైపు గుమ్మలక్ష్మీపురం ఇన్చార్జి ఎంపిడిఒగా జగదీష్ కుమార్‌ను ఉన్నతాధికారులు నియమించారు. ఈయన ప్రస్తుతం ఇఒపిఆర్‌డిగా పనిచేస్తూ ఎఫ్ఎసిపై ఎంపిడిఒ బాధ్యతలు చేపట్టారు.

పాచిపెంట: పాచిపెంట తహశీల్దార్‌గా పి. బాల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె శ్రీకాకుళం జిల్లా పలాస డివిజన్ ఆఫీసులో ఏవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు డిప్యూటీ తహశీల్దార్ ఎం. రాజశేఖర్, ఆర్ఐ రమణారావు, సిబ్బంది స్వాగతం పలికారు.

పార్వతీపురం రూరల్: పార్వతీపురం తహశీల్దారుగా ఆనందరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం జివిఎంసిలో బాధ్యతలు నిర్వహించిన ఈయన ఇటీవల జరిగిన బదిలీలలో పార్వతీపురానికి తహశీల్దార్‌గా వచ్చారు. ఈయనకు స్థానిక డిటి వెంకటరమణ, ఆర్ఐ రామకృష్ణలు స్వాగతం పలికి అభినందించారు.

గరుగుబిల్లి : మండల తహశీల్దార్‌గా కె జయ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహశీల్దారుగా విధులు నిర్వహించిన గేదెల వెంకట జనార్ధన్ సీతానగరం మండల తహశీల్దారుగా బదిలీపై వెళ్లారు. ఈనేపథ్యంలో విశాఖపట్నం జిల్లాలోని గోపాలపట్నం తహశీల్దారుగా పనిచేస్తున్న కె జయను మండల తహశీల్దారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన నూతన తహశీల్దార్‌కు డిటి పెళ్లూరి సత్యలక్ష్మి కుమార్, మండంగి కృష్ణ, సిబ్బంది రమేష్, గులిపల్లి తేజేశ్వరరావు, తుమరాడ నాగరాజు, బసవ సాయిపవన్‌లు అభినందనలు తెలిపారు.

పనులను పరిశీలిస్తున్న జెఇ జగన్మోహన్‌రాజు

శరవేగంగా రహదారి పనులు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట నుండి పాలకొండ వెళ్లే రహదారిలో ఆర్అండ్‌బి ఆధ్వర్యంలో రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆరున్నర కిలోమీటర్ల రహదారి రూ.250 లక్షలతో రహదారి పనులు చేస్తున్నామని ఆర్ అండ్ బి జెఇ జగన్మోహన్‌రాజు తెలిపారు. పనులు నాణ్యతగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ రోడ్డు సామర్థ్యం 40 టన్నుల వరకే పరిమితి ఉంటుందన్నారు. కావున సంబంధించిన అధికారులు దృష్టి సారించి వేరే రహదారిపై భారీ వాహనాలను దారి మళ్లించాలని తెలిపారు. ఇప్పటివరకు ఐదు కిలోమీటర్ల వరకు రహదారి పూర్తయిందని తెలిపారు.

12న యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని ఉద్యోగ సంఘాలు యుటిఎఫ్, ఎస్‌టియు సమక్షంలో ఈ నెల 12న ధర్నా చేస్తామని ఎంఇఒలకు సంఘ నాయకులు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కె.కృష్ణా రావు, పాలక కృష్ణారావు, భాస్కరరావు, ఫకీరు, సింహాచలం తదితరులు ఉన్నారు.

పింఛను అందజేత

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని కొయన్నపేట పంచాయతీ కంచేడువలస గ్రామానికి చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తులు మింది గౌరమ్మ, రైతు సింహాచలంలకు వైసిపి అధ్యక్షులు మావడి రంగునాయుడు సోమవారం రూ. పదివేల చొప్పున పింఛను నగదును అందించారు. వీటితోపాటు కొత్తగా రెండు వికలాంగు పింఛన్లు మంజూరు కావడంతో వాటిని కూడా అందించారు. ఈ కార్యక్రమంలో కంచెడువలస నాయకులు బురిడి చిన్నారావు, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి పెంట సంజీవనాయుడు, వెల్ఫేర్ అసిస్టెంట్ రౌతు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెద భోగిలి సచివాలయాలన్ని ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు సోమవారం పరిశీలించారు. అలాగే సచివాలయం పరిధిలో ఉన్న అభిలాష కేంద్రాన్ని పరిశీలించి, కేంద్రంలో ఉన్న పుస్తకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రం ద్వారా నిరుద్యోగ యువతకు వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడే మెటీరియల్ అందజేయాలన్నారు. ఆయనతో పాటు తహశీల్దార్ జివి జనార్ధన సచివాలయాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎఇ ఎంఎస్‌వి ప్రసాద్, కెకె కుమార్ వర్మ, పెదబాబు, జి.వెంకటరమణ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని గిరిజన గ్రామాల్లో సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు రామారావు, వెంకటేష్ డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి వినతి పత్రాలు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మండలంలోని 17 పంచాయతీల్లో ఉన్న గిరిజన గ్రామాలకు వేసవి సమీపిస్తున్న సందర్భంగా నీటి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యాలు కల్పించాలని గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఉన్న ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద పెండింగ్ ఉన్న బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు ఒక్క పూట పనులు కల్పించాలని గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. వెంటనే పై సమస్యలు పరిష్కరించాలని లేనిచో భవిష్యత్తులో ఇంకా ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో గంగరాజు, చింతామణి, కైలాస్, సింహాచలం, రామన్న బార్కి, పలువురు గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

టిడిపితోనే బిసిలకు న్యాయం

ప్రజాశక్తి- పాచిపెంట

రాష్ట్రంలో టిడిపి హయాంలోనే బీసీలకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగిందని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సోమవారం మిర్తివలసలో సర్పంచ్ కొత్తల సత్యవతి ఆధ్వర్యంలో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత వైసిపి పాలనలో బీసీలు అణిచివేతకు గురయ్యారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీసీలతో పాటు అన్ని వర్గాల ప్రజలూ టిడిపికి అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు విశ్వప్రసాద్, ఆర్‌పి బంజుదేవ్, టిడిపి మండల అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు, గుల్ల వేణు, ఆముదాల పరమేష్, పిన్నింటి ఈశ్వరరావు, కొత్తల పోలినాయుడు, ముఖి సూర్యనారాయణ, దండి మోహన్‌రావు, పి. ఉమామహేశ్వరరావు, చల్లా కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు ఆన్‌లైన్ చేయాలని ధర్నా

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

మండలంలో వెలగవలస, ఎల్‌డి వలస, సంధి వలస గ్రామాలకు చెందిన గిరిజన రైతుల డి పట్టాలను ఆన్‌లైన్ చేయాలని సోమవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి. రాము మాట్లాడుతూ 1993లో 35 మంది గిరిజన రైతులకు డి పట్టాలు ఇవ్వడంతో వారు సాగు చేస్తున్నారన్నారు. సాగు చేస్తున్న డి పట్టా భూములకు ఆన్‌లైన్ చేయకుండా అదే భూములో కొండపోడు పట్టాలు ప్రభుత్వం ఇవ్వడం అన్యాయమన్నారు. అదే గ్రామాల్లో మరో 45 మంది గిరిజన రైతులు సాగు చేస్తున్న భూములకు డి పట్టాలు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకుండా కాలయాపన చేయడం గిరిజనులకు అన్యాయం జరుగుతుందని విమర్శించారు. ఈ సమస్యలపై రెండేళ్లుగా పది దఫాలు గ్రీవెన్స్‌కు వినతి పత్రాలు అందజేసినా అధికారులు పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజన రైతులకు ఉన్న డీ పట్టాలను ఆన్‌లైన్ చేస్తూ, డి పట్టా లేని రైతులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని కలెక్టరుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టి కృష్ణయ్య, జి సింహాచలం, బి అప్పలస్వామి, ఈఎం ముళ్ళు, గిరిజన రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న గిరిజనులు, నాయకులు

పిఎసిఎస్ చైర్మన్‌గా దామోదర్

ప్రజాశక్తి -గరుగుబిల్లి

స్థానిక పిఎసిఎస్ అధ్యక్షులుగా పెద్దూరు గ్రామానికి చెందిన బొబ్బిలి వెంకట దామోదర్ నియమిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పిఎసిఎస్ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించిన బొబ్బిలి అప్పలనాయుడు ఇటీవల మృతి చెందడంతో ఆయన స్థానంలో తాత్కాలిక పిఎసిఎస్ అధ్యక్షులుగా వల్ల గ్రామానికి చెందిన భర్తల ఫకీర్ నాయుడుకు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం పిఎసిఎస్ అధ్యక్షులుగా బొబ్బిలి వెంకట దామోదర్‌ను నియమిస్తూ రాష్ట్ర సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి నుంచి ఉత్తర్వులు వెలుపడ్డాయి. సభ్యులుగా బత్తల పకీరు నాయుడుతో పాటు తెంటు శ్రీరాములును నియమించారు. ప్రస్తుతం నూతనంగా నియ మించిన పిఎసిఎస్ అధ్యక్షులు, సభ్యులు ఈఏడాది జూలై వరకు బాధ్యతలు నిర్వహించనున్నారు. నూతనంగా నియామకమైన పిఎసిఎస్ అధ్యక్షులు, సభ్యులతో త్వరలోనే ప్రమాణ స్వీకారం చేయించనున్నామని సిఇఒ నడుపూరు గుంప స్వామి తెలిపారు.

వెంకట దామోదర్

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి- సీతంపేట

రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని క్లస్టర్ ఇంఛార్జిలు టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి నిమ్మక జయకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం కెఎస్ఎస్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇన్చార్జులు, ప్రతి ఒక కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. ఈ రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం అనివార్యమన్నారు. నియోజకవర్గాన్ని, వెనుకబడి ఉన్న సీతంపేటను అభివృద్ధి చేయాలంటే టిడిపి, జనసేన అధికారంలోకి రావాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పల నాయుడు, సీతంపేట మండల ప్రధాన కార్యదర్శి బిడ్డిక అప్పారావు, క్లస్టర్ ఇంచార్జ్ నిమ్మక చంద్రశేఖర్, ఇమరక పవన్, బిడ్డిక సుబ్బారావు, బీసీ సెల్ అధ్యక్షులు ఆర్ రంగనాథం, ఎస్‌సి సెల్ అధ్యక్షులు గంట సుధా, మహాశక్తి ప్రచారకర్త తోయిక సంధ్యారాణి పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం చేయాలి

గ్రామ స్థాయిలో టిడిపిని బలోపేతం చేయాలని నారీశక్తి టిడిపి నాయకులు పడాల భూదేవి అన్నారు. తన నివాసంలో సోమవారం భామిని, సీతంపేట ముఖ్యనాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశం నిర్వహించారు. బూత్ లెవెల్‌లో ఓటర్ జాబితా వెరిఫికేషన్, ఇంటింటికి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాల నిర్వహణ మొదలైన అంశాల పై చర్చించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు అంగూరు దసరథనాయుడు, సవర కుంపి, సవర గంగయ్య, సవర కూర్మారావు, సవర దేవా, సవర మంగయ్య, గొర్లె శ్రీరాములు, సవర సిమ్మయ్య, సవర మోహన్ పాల్, సవర బాలరాజు, ఆరిక మురళి, పువ్వల కైలాశ్, బి.ప్రసాద్, సవర సురేష్, గొర్లె నాగేశ్వరరావు, సుభాష్, అడ్డాయి, సింగ తదితరులు పాల్గొన్నారు.

మినీ మేనిఫెస్టో గురించి వివరిస్తున్న జయకృష్ణ

మండల అభ్యర్థులకే టిడిపి టికెట్

సీతంపేట మండలానికి చెందిన అభ్యర్థులకే టిడిపి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు. సోమవారం పాలకొండ నియోజకవర్గం మహిళా అధ్యక్షులు బిడ్డక దమయంతి నాయుడు స్వగృహంలో విలేకరులతో టిడిపి నాయకులు మాట్లాడారు. సీతంపేటలో అధిక శాతం ఓటింగ్ ఉందని ఇక్కడున్న గిరిజనులు అధిక శాతం ఎటువైపు వేస్తే వాళ్లే గెలుస్తారని అన్నారు. మండలంలో ఉన్న నిజమైన గిరిజన అభ్యర్థులకే టిడిపి టిక్కెట్ ఇవ్వాలన్నారు. గతంలో సీతంపేట అభ్యర్థికి కాంగ్రెస్ టికెట్ ఇస్తే ఇక్కడ గిరిజనులు గెలిపించారని గుర్తు చేశారు. ఇప్పటికే సీతంపేటలో గిరిజన అభ్యర్థులు ఎక్కువగా చదువుకున్న వారు పోటీ చేయడానికి ఉత్సాహంతో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు ఆరిక లక్ష్మయ్య, సవరమాలయ్య, మాజీ జెడ్‌పిటిసి రాజబాబు, రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి చంద్రరావు, టిడిపి నాయకులు హెచ్ ప్రసాద్, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కుళాయిలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురంలో అన్ని వీధులలోనూ ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరుతూ పలు వీధులకు చెందిన ప్రజలు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనాల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, జనసేన నాయకులు ఆగూరు మని ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో కలెక్టర్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా అన్ని వీధులలో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసినప్పటికీ ప్రధాన వీధికి అనుకొని ఉన్న మర్రి వీధి, ఆగూరు వీధి, కుమ్మరి వీధి, చాకలి వీధిలలో కుళాయిలు ఏర్పాటు చేయలేదన్నారు. గ్రామంలో అందరిలాగే పంచాయతీకి తామూ పన్నులు చెల్లిస్తున్నామని ఈ నాలుగు వీధులలో సుమారు 500 కుటుంబాలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోను చంద్రమౌళి, గురజాన చంద్రమౌళి, గొట్టాపు వెంకటరమణ, పోల సత్యనారాయణ, బర్నాల సీతారాం పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

ఉపాధి పనులతో గ్రామాలను అభివృద్ధి చేస్తాం

ఉపాధి హామీ పనులతో గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత టిడిపిదేనని, అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో పల్లెలను అభివృద్ధి చేస్తామని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. సోమవారం మండలంలోని తాళ్ల బురిడీ గ్రామంలో పర్యటించిన వారు ఉపాధి హామీ వేతన దారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి హామీ పథకాన్ని తుంగలోకి తొక్కిందన్నారు. తమ హయాంలో చెరువు పనులే కాకుండా రహదారుల నిర్మాణాలు, పొలాల్లో నీటి కుంటల నిర్మాణాలు, పంట ఉత్పత్తుల కోసం కల్లాలు నిర్మించామని గుర్తు చేశారు. అభివృద్ధికి మారుపేరైన చంద్రబాబును గెలిపించి పల్లెల తలరాతలను మార్చుకుందామన్నారు.

ప్రకటన

నా క్లయింటు పిన్‌కేర్ బ్యాంకు బొబ్బిలి వారి తరుపు పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు మున్సిపాలిటీకి చెందిన తెలుగు పండావీధి కాపురస్తులు, బూర్లి రాధమ్మ W/o కిలారి క్రిష్ణ Cell No. 9381517290 గారు అందించిన సమాచారం మేరకు సాలూరు పట్టణంలో జెరాక్స్ షాపునుంచి వస్తుండగా ఒరిజినల్ దస్తావేజు నెం. 2208/2009 కనిపించకుండా పోయినది. చుట్టు ప్రక్కల గ్రామాల్లో వెతికినా కనిపించలేదు. సదరు విషయం శ్రీ సాలూరు టౌన్ పోలీసువారికి రిపోర్టు చేయడం జరిగినది. కావున పై దస్తావేజు ఎవరికైన దొరికిన స్వాధీనంలో ఉన్నా నాకు గాని, పోలీసువారికి గాని వెంటనే తెలియచేయవలెను. సదరు డాక్యుమెంటు వేరెవరికి ఎటువంటి హక్కు లేదని తెలియపరచటం జరిగింది.

ఇట్లు
Tiyyala Jayaprakash Babu
Advocate, Bobbili,
Cell: 9390387909